



విఘ్న నాయకుడికి వివిధ రూపాలు

చిత్తూరు వన్నియార్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన చెఫ్ వినాయకుడు - లక్ష్మీనగర్ కాలనీలో కృష్ణావతారం - సీసీఎస్ కాలనీలో మహాలక్ష్మి - 75 దొడ్డిపల్లెలో 40 అడుగుల విజయ వినాయకస్వామి - డీఐ రోడ్డులో మహిషాసుర మర్ధిని అవతారం - కుప్పంలో విశ్వరూప వినాయకుడు - కుప్పం ప్యాలెస్ రోడ్డులో వీణాపాణి - కాణిపాక ఆలయంలో ఆకట్టుకున్న పవళింపు వినాయకుడు - బెండకాయలతో తయారు చేసిన వినాయకుడు

బ్రహ్మోత్సవ వైభవం

కాణిపాకంలో ఘనంగా చవితి వేడుకలు

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

హంస వాహనంపై వినాయకుడి విహారం



ఆస్థాన మండపంలో చిన్నారుల నృత్యవిన్యాసం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను పుణ్యక్షేత్రమైన కాణిపాక ఆలయంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూల విరాట్‌కు ఉభయదారు అయిన కాకర్ల వారిపల్లెకు చెందిన గాలి మునస్వామి నాయుడు అభిషేకాన్ని నిర్వహించారు అనంతరం ఆలయ అలంకార మండపంలో వినాయక వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,కమిషనర్ రామచంద్రమోహన్ ,ఎమ్మెల్యేలు మురళీమోహన్,జగన్మోహన్,కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులను పట్టువస్త్రాలను సమర్పించారు. ఐరాల మండలం అడపగుండ్లపల్లెకు చెందిన దివంగత నాయకుడు మహదేవనాయుడి కుటుంబ సభ్యులు కూడా స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు.కాణిపాక విఘ్నేశ్వర యువజన సంఘం సభ్యులు పుష్ప కావళ్లను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఆలయం వద్ద కావళ్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు.సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను బుధవారం రాత్రి కాణిపాక పురవీధులలో ఘనంగా ఊరేగించారు.స్వామివారిని దర్శించుకొనేందుకు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. వినాయకచవితిని పురస్కరించుకుని కాణిపాక క్షేత్రం బుధవారం భక్తులతో పోటెత్తింది. ఉదయం భక్తుల రద్దీ మోస్తరుగా వున్నా, మధ్యాహ్నం నుంచి వేల సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి. దర్శనానికి సుమారు నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది.మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈవో పెంచల కిషోర్,ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు దర్శన ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ



ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధర్మేశ్వర గురుకుల్- నింగికి ఎగసిన ధ్వజపటం



హంస వాహనంపై విహారం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్ర యుక్త శుభలగ్నంలో మూషిక ధ్వజ పటాన్ని నింగికి ఎగుర వేశారు. గురువారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా యాగశాల ప్రవేశ పూజను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఈవో పెంచల కిషోర్‌కు, ఆలయ అర్చకులు ధర్మేశ్వరగురుకుల్‌కు రక్షా బంధనాన్ని కట్టారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభానికి, మూషికానికి రక్షా బంధనాన్ని కట్టారు. రాత్రి స్వామికి హంస వాహన సేవను నిర్వహించారు.కాణిపాకం,అగరంపల్లె, కారకాంపల్లె,వడ్రాంపల్లె,తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శీర్కరుణీక వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి భాజాభజంత్రీల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సుచిత్ర, మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబు,నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిబాబు, మాజీ జడ్పీటీసీ లత, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు

మంత్రిరామనారాయణరెడ్డి

కాణిపాక ఆలయ అభివృద్ధి కోసం భూములిచ్చిన రైతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం కల్పిస్తామని మంత్రి రామనారాయణరెడ్డి చెప్పారు.కాణిపాక ఆలయంలో మహాప్రాకారం నిర్మించే విషయంలో నిర్ణయం త్వరలో తీసుకుంటామన్నారు.ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లను చాలామంది నిర్వాహకులు దేవదాయ శాఖకు సక్రమంగా పంపలేదని తెలిపారు.కాణిపాక ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. దేవదాయ శాఖలో ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి తదితరులు

ఐదురోజుల్లో రిటైర్‌మెంటు ఎస్ఈగా బదిలీ!

విద్యుత్ శాఖలో చర్చనీయాంశం

చిత్తూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఐదురోజుల్లో రిటైరవుతున్న ఓ ఉన్నతాధికారి చిత్తూరుకు ఎస్ఈగా బదిలీపై రావడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశమైంది.ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో కమర్షియల్ విభాగ జీఎంగా వున్న నరేంద్రనాథ్ చిత్తూరుకు ఇన్‌చార్జి ఎస్ఈగా బదిలీపై వచ్చారు.ఇక్కడున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సెలవుపై వెళ్లగా ఆయన స్థానంలో నరేంద్రనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.చిత్తూరులో ఎస్ఈగా రిటైరవాలన్న ఆయన కోరిక నెరవేర్చడం కోసమే ఇక్కడున్న అధికారిని సెలవుపై పంపించారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఈఈ బభ్రువాహన్ మూడు రోజుల్లో రిటైర్ కానుండగా ఓ ఈఈని లీవ్‌పై పంపి చిత్తూరులో ఈఈగా బాధ్యతలు స్వీకరించి రిటైరయ్యారు.వైసీపీ ప్రభుత్వంలో డీఈగా ఉన్న ఓ అధికారి అప్పటి మంత్రి అండతో ఈఈగా పదోన్నతి పొందిన ఓ అధికారిని పక్కన పెట్టించి మరీ చిత్తూరు ఇన్‌చార్జ్ ఈఈగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్ల పాటు సీనియర్లపై అజమాయిషీ చేశారు.ఆయనకు మంత్రి అండ వుండడంతో ఎవరూ బహిరంగంగా నోరుమెదపలేకపోయారు.అప్పట్నుంచే విద్యుత్ శాఖలో ఈ సంస్కృతికి తెరలేచిందని ఉద్యోగులు వాపోతున్నారు



కుంకీ ఏనుగు దాడి

● అటవీశాఖ అధికారికి తీవ్రగాయాలు

పలమనేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో ఉన్న కుంకీ ఏనుగు జయంత్ దాడిలో అటవీశాఖ అధికారి రఘునాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. కుంకీ ఏనుగుల క్యాంపు వద్ద అటవీశాఖ అధికారులు వినాయక స్వామికి పూజలు చేపట్టారు. ఈ క్రమంలో రఘునాథ్ తరచూ పలకరించే విధంగా జయంత్ వద్దకు వెళ్లగా జయంత్ ఒక్కసారిగా రఘునాథ్‌ను తొండంతో తోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన రఘునాథ్‌ను పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వేలూరు సీఎంసీ కి తరలించారు.



గాయపడిన రఘునాథ్

నేడు, రేపు సచివాలయాల్లో గ్రామసభలు

భూ సబ్ డివిజన్లకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూముల సబ్ డివిజన్ల కోసం శుక్ర, శనివారాల్లో సమీప సచివాలయాల్లో జరిగే 319 గ్రామ సభల్లో దరఖాస్తులను అందించాలని జేసీ విద్యాధరి సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022-24 సంవత్సరాల మధ్య రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన యజమానుల భూముల విభజనకు ప్రభుత్వం గతంలో నిర్దేశించిన రూ.500 రుసుం పూర్తి మినహాయించదని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుం రూ.50 మాత్రమే నామమాత్రంగా గ్రామ సచివాయలంలో చెల్లించి సెప్టెంబరు 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ఏడాది అక్టోబరు, నవంబరులో జరిగిన గ్రామసభల ద్వారా కొన్ని జాయింట్ ఎల్‌పీఎంలను పరిష్కరించామని గుర్తు చేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 15 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా నింద్రలో 37.4 మి.మీ, బైరెడ్డిపల్లెలో అత్యల్పంగా 1.4మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. పెనుమూరులో 31.6, ఎస్ఆర్‌పురంలో 31.4, కార్వేటినగరంలో 19.8, నగరిలో 18.2, పులిచెర్లలో 12, సదుంలో 10,4, విజయపురంలో 10, వెదురుకుప్పంలో 9.4, సోమలలో 6.8, పూతలపట్టులో 5.2, గంగాధర నెల్లూరులో 5, రొంపిచెర్లలో 2.6, ఐరాలలో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది.

నేడు కుప్పానికి చంద్రబాబు

పర్యటన ఏర్పాట్లలో యంత్రాంగం ● హంద్రీనీవా కాలువ వొడ్డున రేపు జలహారతి





జలహారతి ఇవ్వనున్న ప్రాంతంలో మెట్లకు తుది మెరుగులు

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్ర, శని వారాల్లో కుప్పంలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం 5.20 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా శాంతిపురం మండలంలోని తుమ్మిశి దగ్గరున్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. కడపల్లె సమీపంలోని స్వగృహానికి వెళ్లి రాత్రి అక్కడే బస చేస్తారు. మళ్లీ శనివారం ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 3.45 గంటలదాకా కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పరమసముద్రం చెరువుతోపాటు సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్ద జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.కృష్ణా జలాలకు హారతి ఇవ్వడానికి ముందు కాలువ వొడ్డున పైలాన్ ప్రారంభిస్తారు. సమీపంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని నియోజకవర్గ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.సాయంత్రం హెలికాప్టర్ ద్వారా బెంగళూరు ఎయిర్ పోర్టు, అక్కడినుంచి అమరావతి వెళతారు. చంద్రబాబు పర్యటనకోసం అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హంద్రీ-నీవా కాలువ పొడవునా పోలీసు బలగాలు భద్రతా చర్యలు చేపట్టాయి. పరమసముద్రం చెరువు సమీపంలో హంద్రీ-నీవా కాలువ వొడ్డున పైలాన్ నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఆ సమీపంలో సీఎం జలహారతి ఇవ్వనున్న ప్రాంతంలో కాలువలోకి మెట్ల నిర్మాణం పూర్తిచేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. అలాగే పరమసముద్రం చెరువులో కూడా జలహారతి ఇచ్చే అవకాశం ఉన్నందున మెయిన్ రోడ్డునుంచి చెరువు దాకా కాలువ వొడ్డును మన్ను వేసి చదును చేసే పనులు సాగుతున్నాయి. మరోవైపు బహిరంగ సభావేదిక సైతం ఆ సమీపంలోనే సిద్ధం చేస్తున్నారు.



చకచకా సాగుతున్న పైలాన్ నిర్మాణం

సీఎం రేపటి షెడ్యూల్

10.30 ఏఎం : హంద్రీనీవా పైలాన్ ఆవిష్కరణ

11.15 ఏఎం : కృష్ణాజలాలకు హారతి

11.20 ఏఎం : పరమసముద్రం చెరువు సమీపంలో సభ, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఎంవోయూలు

11.50 ఏఎం : 1.20 పీఎం - సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగం

2.00 పీఎం : 3.45 పీఎం - పరిశ్రమల ప్రతినిధులు, ఇతర ముఖ్యులతో సమావేశం

3.50 పీఎం : తిరుగుప్రయాణం



కొల్లు రవీంద్ర, అన్బుమణి రామదాస్ - జస్టిస్ బాలాజీ

తిరుమలలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధ, గురువారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ బాలాజీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామదాస్ ఉన్నారు.

తిరుమలలో పర్యావరణ ప్రణాళిక రూపొందించండి

● ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వృక్ష సంపద పెంపు, మానవులు-వన్యప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై అటవీశాఖ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన సమీక్షలో జేఈవో వీరబ్రహ్మంతో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు పాల్గొన్నారు. గతేడాది తిరుమలలో చేపట్టిన వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి వాటిపై డీఎఫ్‌వో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు తాండ్ర, రావి, ఉసిరి, వెలగ, జువ్వి, మర్రి, నేరేడు, అత్తి, ఎర్రచందనం వంటి 7 వేల మొక్కలు నాటినట్టు వివరించారు. వాటర్‌షెడ్, మట్టిస్థిరీకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా అలిపిరి-తిరుమల మార్గాల్లో రెండువైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌరశక్తితో నడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాట్లు చేశామన్నారు. శ్యామలరావు మాట్లాడుతూ..మరింత ఆధునిక నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమ, మంగళవారాల హుండీ ఆదాయం: రూ.6.55 కోట్లు

మంగళ, బుధవారాల్లో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 1,55,022

తలనీలాలు సమర్పించినవారు: 44,608

'ఇంటి గణపయ్య'ల నిమజ్జనం





తిరుపతిలోని ఇళ్లల్లో వినాయక ప్రతిమలతో 'చవితి' పూజలు నిర్వహించిన వారిలో చాలామంది బుధవారం సాయంత్రమే విగ్రహాలను నిమజ్జనం చేశారు. కుటుంబ సమేతంగా వినాయక సాగర్‌కు విగ్రహాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కొన్ని పెద్దవిగ్రహాలనూ తీసుకొచ్చారు. కాగా, మండపాల్లోని భారీ విగ్రహాలను ఐదో రోజైన ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి



సమన్వయంతో ముందుకు సాగేలా..!

● నేటి దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, పోలీసు ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం ఉదయం జరిగే సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 65 మంది అధికారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి దాదాపు ఏడు కమిటీలను నియమించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పాండిచ్చేరి, లక్షదీప్, అండమాన్ నికోబార్ నుంచీ పోలీసు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. గురువారానికే నలుగురు డీజీపీలు సహా మొత్తం 56 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరికి 14 మందికి హోటల్ తాజ్, 42 మందికి గ్రాండ్ రిడ్జ్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలు, ఉగ్రవాద నిర్మూలన, ఎర్రచందనం స్మగ్లింగ్, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, అంతర్రాష్ట్ర నేరస్తుల ముఠాలను పట్టుకోవడం, సైబర్ క్రైం, నూతన టెక్నాలజీ వినియోగం, సమాచార మార్పిడి వంటి అంశాలపై చర్చించనున్నారు. ప్రధానమైన పది అంశాలపై చర్చించి.. సంయుక్తంగా ముందుకెళ్లడానికి కార్యాచరణ రూపకల్పనకు చర్యలు చేపట్టనున్నారు.

క్రీడావిజేతలు విశాఖకు పయనం



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు గురువారం విశాఖపట్నానికి బయలుదేరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వీరికి సీఎం చంద్రబాబు క్రీడాకారులకు బహుమతులు, పతకాలు ప్రదానం చేయనున్నారు. ఈక్రమంలోనే ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు దాదాపు 50మంది తరలివెళ్లారు. వీరికి డీఎస్‌డీవో శశిధర్ వారికి అభినందనలు తెలియజేశారు.

పల్లెల వికాసానికి అగ్రాసనం

● పీఎంఏజీవై నిధులతో ఎస్సీ గ్రామాలకు ప్రగతిబాట ● రెండో విడత 53 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

● రూ.11.20కోట్లతో పనులతో పలు అభివృద్ధి పనులు ● గత పాలనలో ఈ పథకం నిధులు పక్కదారి



పెళ్లకూరు మండలం పునబాక ఎస్టీకాలనీలో పైపులైను వేస్తున్న దృశ్యం



వాకాడు మండలం బుడిగాలవాగులో సీసీరోడ్డు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.గతేడాది పల్లెలు చేపట్టింది మొదలు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వస్తోంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానస్థితికి చేరిన రహదారుల్లో చాలామటుకు రూపురేఖలు మార్చింది. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. కేంద్రం ఇస్తున్న ప్రతిపైసాను వెచ్చిస్తూ చిత్తశుద్ధిని చాటుకుంటోంది. ఈక్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై)-2 కింద మంజూరైన నిధులతో ఎస్సీ పల్లెల వికాసానికి సంకల్పించింది.

చేపట్టాల్సిన పనులపై సర్వే: జిల్లాలో పీఎంఏజీవై పథకం రెండో విడతలో షెడ్యూల్‌కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, భవనాలు, ఓవర్‌హెడ్‌ట్యాంకులు, మినరల్ వాటర్‌ప్లాంట్లు, శ్మశానవాటికల నిర్మాణంలతో పాటు జీవనోపాధి నైపుణ్యాభివృద్ధికీ ఈ నిధులు వెచ్చించనుంది. గ్రామానికి రూ.20లక్షలు చొప్పున మలివిడత ఎంపికైన 53 గ్రామాల్లో మంజూరైన రూ.11.20కోట్లతో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులు సర్వే చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిధుల పక్కదారి : వైసీపీ హయాంలో పీఎంఏజీవై కింద మొదటి విడతలో 118 గ్రామాల అభివృద్ధికి కేంద్రం రూ.23.60కోట్ల మేర ఆర్థిక సాయం ప్రకటించింది. అందులో రూ.8కోట్లు రాగా నాటి పాలకులు అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించారు. క్షేత్రస్థాయిలో పనులు జరగకుండా సుమారు రూ.2కోట్ల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టాక విడుదలైన మరో రూ.8కోట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించేలా శ్రద్ధ వహించారు. రెండవ విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించినట్లు పీఎంఏజీవై జిల్లా కన్వీనర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి భరోసా

ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పీఎంఏజీవై పథకం భరోసాలాంటిది. మొదటి విడతలో పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసి చాలా వరకు పనులను పూర్తి చేశాం. రెండవ విడతలో 11.20కోట్లతో మారుమూల గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతిపైసాను సద్వినియోగం చేస్తాం. పనుల్లో నాణ్యత లోపించినా, అవినీతి జరిగినా ఉపేక్షించేదిలేదు.

- వెంకటేశ్వర్, కలెక్టర్

యువకుడి దారుణ హత్య

● పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు



శివారెడ్డి(ఫైల్‌ఫొటో)

వెంకటగిరి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ తోట వద్ద బుధవారం శివారెడ్డి అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... మండల పరిధిలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన ఆటుమడుగు ఈశ్వరయ్య కుమారుడు శివారెడ్డి(25) వెంకటగిరిలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి వెంకటగిరికి వచ్చాడు. రాత్రి ఇంటికి ఆకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా రాత్రి 9గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు వెళ్లడాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం జామాయిల్ చెట్ల మధ్య శివారెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పాటు సమీపంలో పగిలిన బీరు బాటిళ్లు ఉన్నాయి. వెంటనే పోలీసు స్టేషనుకు సమాచారం ఇవ్వగా తాము వినాయక చవితి ఉత్సవాల్లో బిజీగా ఉన్నామని పోలీసులు చెప్పారు. గురువారం ఉదయం గూడూరు డీఎస్పీ గీతాకుమారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమ్మపాళెం గ్రామానికి చెందిన జానకీరామయ్య, సాయిలను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు ఉన్నారు.



నిందిత మహిళలతో పోలీసులు - ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్


కుప్పం కిలేడీల ఆట కట్టు

బస్సుల్లో చోరీ చేసే నలుగురు అరెస్టు

రూ.23 లక్షల ఆభరణాల స్వాధీనం

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బస్టాండ్లలో తిష్ట వేస్తారు. ఆభరణాలతో ప్రయాణించే మహిళలను గుర్తించి.. వారు ఎక్కే బస్సులో ఎక్కేస్తారు. మాటల్లో పెట్టి.. మాయ చేసేస్తారు. సొమ్మంతా కాజేసి మాయమైపోతారు.కుప్పానికి చెందిన నలుగురు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి..ఇలా చోరీలు, దోపిడీలకు తెగబడుతున్నారు.వీరిని అనంతపురం జిల్లా రాయదుర్గం రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన 242.5 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ జగదీష్ గురువారం మీడియాకు వివరాలను వెల్లడించారు.కుప్పానికి చెందిన సుమతి(46), గీత(37), రంజిత(33), బృంద(27) సమీప బంధువులు. ఈ ముఠాలో సుమతి కీలకం. పూసలు, రోల్డ్ గోల్డ్ నగల వ్యాపారం వీరి వృత్తి. కానీ ఈ ముసుగులో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. గత ఏడాది కణేకల్లు బస్టాండ్‌లో ఓ మహిళ తన ఆభరణాలను జాగ్రత్తగా పెట్టుకోవడం చూశారు. ఆమె ఎక్కిన బస్సులోనే ప్రయాణం చేశారు. ఆమెతో మాటలు కలిపి బ్యాగ్‌లో ఉన్న 70 గ్రాముల లాంగ్ చైన్, 50 గ్రాముల నెక్లెస్‌ను తస్కరించి మాయమైపోయారు. ఈ నెల 23వ తేదీ కళ్యాణదుర్గం బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న ప్రయాణికురాలిపై నిఘా వేశారు.ఆమె కణేకల్లు క్రాస్ వద్ద బస్సు దిగబోతుండగా, పథకం ప్రకారం అడ్డుగా నిలిచారు. దీంతో బస్సు స్టాప్ దాటి కొంత దూరం వెళ్లింది. ఎవరూ లేనిచోట ఆగింది. అక్కడ ఆమెతోపాటు ఈ ముఠా దిగింది. బృంద కత్తి తీసుకుని ఆ మహిళను బెదిరించింది. మిగిలినవారు ఆమె వద్ద ఉన్న 107.5 గ్రాముల లాంగ్‌చైన్, గాజులు, డాలర్ చైన్, ఉంగరం, కమ్మలను లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ రంగంలోకి దిగారు. కణేకల్లు మండలం యర్రగుంట క్రాస్ వద్ద ఈ ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్వీ జూ పార్కుకు విదేశీ వన్యప్రాణుల రాక



మీర్కాట్ - మార్మోసెట్ - రెడ్ నెక్కుడు వాలాబి

తిరుపతి(మంగళం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూ పార్కులో కొత్తగా వివిధ దేశాలకు చెందిన వన్యప్రాణులు సందడి చేయనున్నాయి. గుజరాత్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు సహకారంతో అక్కడ్నుంచి విదేశీ వన్యప్రాణులను తీసుకొచ్చామని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. వీటిల్లో ఆస్ట్రేలియాలోని కంగారు జాతికి సమీప పోలికలున్న రెండు రెడ్ నెక్కుడు వాలాబిలను, దక్షిణాఫ్రికాలో జీవించే మీర్కాట్‌లు రెండు, బ్రెజిల్‌తోపాటుగా సమీప దేశాల్లో జీవించే రెండు మార్మోసెట్ వన్యప్రాణులను తీసుకొచ్చామని వివరించారు. వీటిని సంజీవని బ్లాక్‌లో క్వారంటైన్‌లో ఉంచి ఆరోగ్యం, అనుకూలతలను పర్యవేక్షిస్తున్నామన్నారు. క్వారంటైన్ కాలపరిమితి పూర్తయ్యాక సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్లలో ఉంచుతామన్నారు.

సీఎం జలహారతిలో అందరూ భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్సీ కంచర్ల, కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపు



హంద్రీ-నీవా కాలువ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన రాయలసీమ అన్నదాతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న కానుక కృష్ణా జలాలు అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఈనెల 30వ తేదీన పరమసముద్రం చెరువు సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో సీఎం జలహారతి ఇవ్వనున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఎం పర్యటనలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తికావడమే కాకుండా ఈనెల చిట్టచివరి గమ్య స్థానమైన కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు కాలువ ద్వారా కృష్ణా జలాలు చేరుతున్న విషయం తెలిసిందే. ఈ చెరువు సమీపంలో ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువలో జలహారతి ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆయన 29వ తేదీన కుప్పం చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, మరోవైపు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.పరమసముద్రం చెరువుతోపాటు హంద్రీనీవా కాలువలో జలహారతి ఇవ్వనున్న ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను చూసి, తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం స్థానిక కడా కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం పాల్గొనే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అన్నదాతలు, ఇతరత్రా ప్రజలందరూ పెదయెత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ పరమసముద్రం చెరువు, దాని సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో సీఎం జలహారతి ఇవ్వనున్నందున నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం వుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో సైతం అదే సమయానికి ఆయా మండలాల ప్రజలు, అన్నదాతలు కాలువ వెంబడి జలహారతులు ఇవ్వనున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇందుకు తగిన ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ వెంట ప్రజలు వస్తారన్న అంచనా ఉన్న ప్రతి ప్రాంతంలో పోలీసు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. వృద్ధులను, పిల్లలను ఆయా ప్రాంతాలకు తీసుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యాన శాఖ డీడీ మధుసూదన రెడ్డి, సెరికల్చర్ జేడీ పద్మావతి, డీపీవో సుధాకర రావు, ఇండస్ట్రీ జీఎం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలనుకుంటున్నారా?

● అరవింద్ ఆస్పత్రిలో హెల్ప్‌లైను నెంబరు ప్రారంభించిన టీటీడీ ఈవో



హెల్ప్‌లైన్ నంబరు ప్రారంభిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ మరణానంతరం నేత్ర దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అలాంటి వారి కోసం తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదాన కేంద్రాన్ని.. 93983 58828 హెల్ప్‌లైను నెంబరును టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం ప్రారంభించారు. 'డయల్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు టీటీడీ పరిధిలో ఒక నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. అప్పటి నుంచి నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేశాం. ఆ విషయాన్ని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి వారి దృష్టికి తీసుకురాగా వెంటనే నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలకు భక్తులు ముందుకు రావాలి' అని ఈవో పిలుపునిచ్చారు. ఆస్పత్రి సీఎంవో డాక్టర్ అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ.. దేశంలో 11 లక్షల మందికిపైగా కంటి చూపు కోసం ఎదురు చూస్తుంటే, వీరిలో 25 వేల మందికే దాతలు ఇచ్చిన కళ్లను అమర్చి కంటి చూపును ప్రసాదించే అవకాశం ఉందన్నారు. ప్రజలు నేత్రదానానికి ముందుకొస్తే అవసరమైన వారందరికీ కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డాక్టర్లు సురేంద్ర, బిస్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం

గైర్హాజరైన అభ్యర్థులకు నేడు అవకాశం



ఎస్వీ సెట్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనను పర్యవేక్షిస్తున్న తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, ఎస్ఎస్ ఏపీసీ గౌరీ శంకర్‌రావు, చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి - వేచి ఉన్న అభ్యర్థులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 మెరిట్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చిత్తూరు, తిరుపతి డీఈవోలు వరలక్ష్మి, కేవీఎన్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. మురకంబట్టులోని అపోలో విశ్వవిద్యాలయంలో డీఈవో వరలక్ష్మి, తిరుపతి రోడ్డులోని ముత్తిరేవుల సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)లో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్‌లు లైన్ డిపార్టుమెంట్ అధికారులతో కలిసి పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. ఉదయం తొమ్మిదిగంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 పోస్టులు భర్తీ చేయనుండగా, తొలిరోజైన 1,200 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాష్ట్ర విద్యాశాఖ అనుమతిస్తూ.. అభ్యర్థుల వ్యక్తిగత మొబైల్స్‌కు సమాచారం పంపింది. ఒక్కో కేంద్రంలో 15 బృందాల చొప్పున 110మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో పాల్గొన్నారు. పరిశీలన కేంద్రంలోకి అభ్యర్థితోపాటు వారి తల్లిదండ్రులను మాత్రమే అనుమతించారు. ప్రతి సమస్యను చిత్తూరు, తిరుపతి డీఈవోలు పరిష్కరించడంతోపాటు దివ్యాంగుల కేటగిరీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను మరింత క్షుణ్ణంగా పరిశీలించారు. దివ్యాంగులైన అభ్యర్థులను తదుపరిపరీక్షల నిమిత్తం రాష్ట్రంలో నిర్దేశించిన రెఫరల్ ఆస్పత్రులకు పంపారు. మెరిట్ సాధించి, కాల్ లెటర్ పొంది.. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు గైర్హాజరైన వారికి రాష్ట్ర విద్యాశాఖ మరో అవకాశం కల్పించింది. వీరితో పాటు మెరిట్ జాబితాలోని మిగిలిన 278 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం కొనసాగనుంది. ఈప్రక్రియలో రెవెన్యూ, డీఆర్‌డీఏ, ఎస్సీఎస్టీమైనారిటీ, మెడికల్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈడీటీలకు మరో ఏడాది డిప్యుటేషన్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ల(ఈడీటీలకు)కు మరో ఏడాదిపాటు డిప్యుటేషన్ గడువును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ ఉత్తర్వు (సంఖ్య 2331)ను జారీచేశారు. ఈడీటీ పోస్టులన్నీ కేవలం తాత్కాలికమేనని పేర్కొన్నారు. ఈ గడువు పొడిగింపు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వ తేదీవరకు కొనసాగనుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఈడీటీ ఉంటారు. వీరందరూ నియోజకవర్గకేంద్ర తహసీల్దార్ కార్యాలయంలో ఉంటూ పనిచేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఏడుగురు, తిరుపతి జిల్లాలో ఏడుగురు ఉన్నారు. ఓటరు జాబితా నిరంతర నవీకరణ, ఓటరు (ఎపిక్) కార్డుల జారీ, పేర్ల సవరణ, చిరునామా మార్పు, ఇతర ఎన్నికలకు సంబంధించిన పనులు ఉండడంతోనే వారిని మరో ఏడాది గడువు పెంచినట్లు తెలుస్తుంది. పదోన్నతులు ఇచ్చేటప్పుడు ఈడీటీ పోస్టులకు నియమించకూడదని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఎన్‌సీడీ సర్వే పక్కాగా నిర్వహించాలి

చిత్తూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా నిర్వహించనున్న ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వేను కచ్చితత్వంతో నిర్వహించాలని వైద్యాధికారులకు నోడల్ అధికారి గిరి అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌సీడీ 4.0 సర్వేపై వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి.. వైద్యం కోసం రెఫర్ చేయాలన్నారు. అనంతరం బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లపై డాక్టర్ శ్వేత శిక్షణ ఇచ్చారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, డాక్టర్లు మమతా రాణి, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయ బోర్డుకు 115 దరఖాస్తులు

చౌడేపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి ధర్మకర్తల కోసం 115 దరఖాస్తులు వచ్చినట్లు ఆలయ ఈవో ఏకాంబరం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 27 వరకు 115 మంది అభ్యర్థులు పాలక మండలి సభ్యుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 1న దరఖాస్తుదారుల ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, బోయకొండ ఆలయ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు తప్పక హాజరు కావాలని కోరారు. .

మరోసారి క్రీడా ప్రతిభ పాఠశాలగా 'పీఎం శ్రీ'



వడమాలపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపడంతో మరోసారి వడమాలపేటలోని పీఎం శ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 'క్రీడా ప్రతిభ' అవార్డుకు ఎంపికైంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా ప్రతి జిల్లా నుంచీ విద్యా సంవత్సరంలో విద్యార్థుల క్రీడా ప్రతిభ ఆధారంగా ఐదు పాఠశాలలకు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' (క్రీడా ప్రతిభ) అవార్డులను ప్రదానం చేస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 57 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో, ఒకరు జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపారు. తద్వారా 222 పాయింట్లతో ఈ పాఠశాల మూడో స్థానాన్ని దక్కించుకుంది. గతంలో 2022-23 విద్యా సంవత్సరంలో 97 పాయింట్లతో ఐదో స్థానం, 2023- 24లో 178 పాయింట్లతో మూడో స్థానం సాధించింది. ఇలా వరుసగా మూడుసార్లు క్రీడా ప్రతిభకు ఎంపికకావడం ఆనందంగా ఉందని పీడీ చంద్రశేఖర్ రాజు చెప్పారు.

గతంలోకంటే మెరుగైన రహదారులు

● అమెరికా మంత్రి కితాబు



అమెరికా మంత్రి బద్రీనాథ్‌ను సన్మానిస్తున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి(రవాణా), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో కంటే రహదారుల నిర్మాణం మెరుగ్గా ఉందని అమెరికా మంత్రి లంఎకల బద్రీనాథ్ కితాబిచ్చారు. అమెరికాలో మంత్రిగా ఉంటూ ఆయన స్వగ్రామం చంద్రగిరికి వచ్చారు. ట్రాన్స్‌పోర్టు ఇంజనీరింగ్ విభాగంలో స్పెషలైజేషన్ చేసిన ఆయన రవాణాశాఖ విధి విధానాల గురించి తెలుసుకోవడానికి గురువారం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఘనంగా సన్మానించారు. రవాణా శాఖలో అవలంబిస్తున్న విధివిధానాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికానాజ్, ఏవోలు విజయకుమార్, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

జనవరిలో పద్మావతి వర్సిటీ 22వ స్నాతకోత్సవం

● దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవాన్ని జనవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌పర్సన్ పద్ధతిలో స్నాతకోత్సవంలో పట్టాలు స్వీకరించడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని ఒక ప్రకటనలో తెలిపారు.

దుబాయి కరెన్సీ పేరిట రూ.5లక్షలకు టోకరా

చంద్రగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దుబాయి కరెన్సీపేరిట టోకరా వేశాడో దుండగుడు.. పోలీసుల కథనంప్రకారం పీలేరులోని చెన్నారెడ్డికాలనీకి చెందిన సలీం బాషా అగరుబత్తీల వ్యాపారం చేస్తుంటాడు. పది రోజుల క్రితం అతని దగ్గరకు ఓ అపరిచిత వ్యక్తి వచ్చాడు. తనవద్ద దుబాయి కరెన్సీ ఉందన్నాడు. తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. ఒక నోటు ఇచ్చి నమ్మించాడు. తర్వాత తన వద్ద ఉన్న రూ.5లక్షల దుబాయి కరెన్సీని తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. సలీంబాషాను బుధవారం చంద్రగిరి లైబ్రరీ వద్దకు రమన్నాడు. అతడి మాటలను నమ్మి వచ్చిన సలీంబాషాకు సదరు మోసగాడు దుబాయి కరెన్సీ అంటూ ఓ బ్యాగు ఇచ్చాడు. దానిని తీసుకుని బాషా అతనికి మన దేశ కరెన్సీ రూ.5లక్షలు చెల్లించాడు. ఇదే సమయంలో మాయమాటలు చెబుతూ కాస్పేటికే అపరిచితుడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తర్వాత సలీంబాషా బ్యాగు తెరిచి చూడగా న్యూస్‌పేపర్ల కట్ట ఉంది. మోసపోయినట్లు గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

వైసీపీ కౌన్సిలర్‌కు రెండు పేర్లు !

సోషల్ మీడియాలో వైరల్ కావడంపై చర్చ



పల్లిపట్టులో ఐశ్వర్య పేరుతో ఓటరు కార్డు - నగరిలో సాయి సంధ్యారాణి పేరుతో ఓటరు కార్డు

చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):నగరి ఆరవ వార్డు కౌన్సిలర్ సాయిసంధ్యారాణికి రెండు ఓటరు కార్డులున్నాయంటూ సోషల్ మీడియాలో వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తమిళనాడులోని పల్లిపట్టులో ఐశ్వర్య అనే పేరుతో ఓటుహక్కున్న మహిళకు నగరిలో సాయిసంధ్యారాణి పేరుతో ఓటరుకార్డు సృష్టించి ఆరవ వార్డు కౌన్సిలర్‌గా వైసీపీ గెలిపించిందని ఆ వార్త సారాంశం.స్థానికసంస్థల ఎన్నికలలో వైసీపీ చేపట్టిన బాగోతాలు ఇప్పుడు ఒకటొకటే బయటపడుతున్నాయని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.



కృష్ణా జలాలతో నిండుతున్న పరమసముద్రం చెరువు



పరమసముద్రం చెరువులో కృష్ణమ్మ కలుస్తున్న చోట జనసందోహం



కాలువలో మనవరాలి కేరింతలకు మురిసిపోతున్న ముసలమ్మ

కుప్పంలో 'గంగ'జాతర!

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కరువునేల కుప్పం కృష్ణమ్మ జలాలతో పునీతమవుతోంది.ఎండిపోయి బీడుపడ్డ పొలాలతోపాటే బీటలు వారిన బతుకులపై జలాలను చిలకరించడం కాదు.. కాలువతో ఎత్తిపోస్తోంది. నిలువెల్లా తడుస్తున్న బతుకులు పులకింతలవుతున్నాయి. హంద్రీ-నీవా వొడ్డుకు చేరి పూజలు, కేరింతలతో సంబరాలు జరుపుకుటున్నాయి. ఏడాదికోమారు కాదు.. ఇక ఏడాదంతా 'గంగమ్మ ముంగిట్లోనే ప్రవహిస్తుందని, చెరువు దొరువులు నింపుతూ హంద్రీ-నీవా కాలువ సాగినంత మేరా పచ్చటి పంటలను ప్రసాదిస్తూ, జీవితాల్లో సుఖసంతోషాలు నింపుతుందని పొంగిపోతున్నారు కుప్పం ప్రజలు. హంద్రీ-నీవా పనులను శరవేగంతో పూర్తి చేసి, శ్రీశైలంనుంచి కృష్ణా జలాలను కుప్పం దాకా తీసుకువచ్చి నియోజకవర్గ ప్రజలకిచ్చిన వాగ్దానం నెరవేర్చుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. చెప్పాలంటే చెప్పిన సమయంకంటే మూడునాలుగు నెలల ముందే పట్టుబట్టి కుప్పం నియోజకవర్గాన్ని కృష్ణా జలాలతో తడుపుతున్నారు. ఎండిపోయిన చెరువులు, అడుగంటి జల మృగ్యమైన బోరుబావులు, ఎండిపోతున్న పంటలు.. ఇన్నాళ్ల కుప్పం ప్రజల జీవన చిత్రమిది. ఇప్పుడు తరలివస్తున్న కృష్ణమ్మతో ప్రజలు జనం ఎంత సంతోషంగా ఉన్నారో.. పరమసముద్రం చెరువుతో పాటు, అక్కడిదాకా సాగివచ్చిన హంద్రీ-నీవా కాలువ వెంట గురువారం జాతరలా తరలివచ్చిన జనం సంబరాలు చూస్తే అర్థమవుతుంది.. గంగమ్మ వారి బతుకుల్లో ఎన్ని వెలుగు పూయించనుందో.

కాణిపాకంలో నూతన అన్నదాన భవనం ప్రారంభం



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న మంత్రి తదితరులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో రూ. 4 కోట్లతో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం నాయకులు, అధికారులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి నిత్యం విచ్చేసే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఏడువేల మందికిపైగా అన్నదానం చేయడానికి దేవదాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో పాత భవనం సరిపోదని నూతన అన్నదాన భవనాన్ని నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అక్రమ క్వారీని వెంటనే ఆపాలి

కలెక్టరేట్ వద్ద సురేంద్రనగరం పంచాయతీ వాసుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సురేంద్ర నగరం పంచాయతీ రైతులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తమ పంచాయతీల్లో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ పనులను వెంటనే ఆపాలని కార్వేటినగరం మండలం సురేంద్రనగర్ పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ పరిధిలోని సురేంద్రనగరం, వేపగుంట, తిరుమల కుప్పం గ్రామాలకు చెందిన రైతులు, స్థానికులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. సురేంద్రనగరం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబరు 714లోని భూముల్లో ఇతర జిల్లాకు చెందిన వెంకటేశ్‌రెడ్డి, అతని అనుచరులు మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా అక్రమంగా క్వారీ పనులు చేస్తున్నారని ఆరోపించారు. భారీ వాహనాలతో క్వారీ రాళ్లను తరలించడం, నల్ల మందులతో రాళ్లను పేల్చడంతో మూడు గ్రామాలు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తాగునీరు కలుషితమై పోయిందన్నారు. ఈ సమస్యపై నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడం లేదన్నారు. కోట్లాది రూపాయల విలువైన రాళ్లు తరలిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం స్పందించి అక్రమ క్వారీ పనులను ఆపకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

రెండు లక్షల పుస్తకాల పంపిణీ:తులసీనాథం



తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు

గంగవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలలో ఇప్పటివరకు రెండు లక్షల పద్యాల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు తెలిపారు. గురువారం స్థానిక కళామందిరంలో వారు మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో తాము సొంతంగా పద్యాల పుస్తకాలను తయారు చేసి వాటిని పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని 2017 లో ప్రారంభించామన్నారు. వీటితో పాటు విద్యార్థుల మేధస్సును పెంపొందించే 5 వేల పెద్ద బాలశిక్ష పుస్తకాలు, పాఠశాలల్లో ప్రార్థన సమయాల్లో తాము తయారు చేసి ముద్రించిన 3 వేల జ్ఞాన దీపాలు, బొమ్మల భారతం, బొమ్మల రామాయణం, బొమ్మల భాగవతం, బొమ్మల పంచతంత్ర కథలు, హరికిషన్ కథలు, తెనాలి రామకృష్ణ కథలు, అక్బర్ -బీర్బల్ కథలు, చందమామ కథలు, నసీరుద్దీన్ కథలు, తెలుగు వ్యాకరణం, వ్యాసాలు, దేశ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్ర, తులసాకులు, తులసిరసాలు, తులసి పుష్పాలు తదితర 4 వేల పుస్తకాలను విద్యార్థులకు , పాఠశాలలకు అందించామన్నారు. ఇలా 2017 నుంచి మొత్తం 2 లక్షల పుస్తకాలను ఉచితంగా పింపిణీ చేశామని తెలిపారు.

కారు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు - స్వల్పగాయాలతో బయటపడ్డ ఏడేళ్ల చిన్నారి





ప్రమాదానికి గురైన కారు - నాగేంద్ర, సుబ్బరాయుడు మృతదేహాలు

పూతలపట్టు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏడేళ్ల చిన్నారి మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులో నివాసముంటున్న సుబ్బరాయుడు తమ కారులో కుటుంబీకులతో కలిసి సొంత పని నిమిత్తం గురువారం నెల్లూరుకు బయల్దేరాడు. మార్గమధ్యంలో బెంగళూరు - తిరుపతి సిక్స్ లేన్ రోడ్డులో పూతలపట్టు మండలం కొత్తకోట సమీపాన ఓ ప్రైవేటు డెయిరీ ఎదురుగా ఉన్న డివైడర్‌ను వీరి కారు ఢీకొంది. సుబ్బరాయుడు (60) అక్కడున్న కల్వర్టులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న సుబ్బరాయుడు కుమారుడు నాగేంద్ర (30) వాహనంలోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక సీట్లో కూర్చొని ఉన్న సుబ్బరాయుడు కుమార్తె సుభాషిణి, భార్య మంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. సుభాషిణి కుమారుడు లక్కీ (7) మాత్రం స్వల్ప గాయాలతో బయటపడటం గమనార్హం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.





కల్వర్టులో సుబ్బరాయుడి మృతదేహం - కారులోనే మృతి చెందిన నాగేంద్ర

ఆ పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల్లేవ్..!

ఎల్ఎల్‌బీ విద్యార్థుల ఆవేదన లేఖ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి ఎల్ఎల్‌బీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల్లేవంటూ ఎస్వీ సెట్‌లోని ఆర్‌కేఎం కళాశాల ఎల్ఎల్‌బీ విద్యార్థులు బాలు, వెంకటేష్, జయకుమార్ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ లేఖ రాశారు. 'మహిళల వాష్‌రూమ్‌నే పురుషులూ ఉపయోగించాల్సి వస్తోంది. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థి తీవ్ర ఇబ్బందికి గురయ్యాడు. ఒక్కో డెస్క్‌ని ఇద్దరు విద్యార్థులకు కేటాయించారు. అదేంటని అడిగితే కళాశాలలో తరగతి గదులు తక్కువగా ఉన్నాయని, సర్దుకోవాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఇన్విజిలేటర్ల పేర్లను ముందుగానే తెలియజేస్తున్నారు. దీనివల్ల ఆయా వర్గానికి చెందిన విద్యార్థులు ఇన్విజిలేటర్‌తో కుమ్మక్కవడం జరుగుతోంది. ప్రిన్సిపాల్ కూడా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నారు. ఇక ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్ అధికార దర్పంతో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల మౌలిక వసతులు ఉండటం లేదు' అని విద్యార్థులు బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

ఏనుగుల దాడిలో వరిసాగు ధ్వంసం



పలమనేరు మండలం నూనేవారిపల్లిలో ధ్వంసమైన వరి పంట

పలమనేరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం నూనేవారిపల్లి సమీపంలోని వరిపొలాలపై బుధవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. సుమారు నెల రోజులు క్రితం నాటిన వరిపొలాల్లో ప్రవేశించి తొక్కి నాశనం చేశాయి. రైతు జోగుల రమేష్‌కు చెందిన వరి పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తెలుగుభాషకు గిడుగు సేవలు మరువలేనివి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశులు

పలమనేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలు మరువలేనిదని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు అన్నారు. గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. నేడు మాట్లాడుతున్న సరళమైన భాష ఉద్యమ ఫలితమే అన్నారు. తెలుగు విభాగాధిపతి వాసు మాట్లాడుతూ 20వ శతాబ్ద ప్రారంభంలో గ్రాంధిక భాషతో విద్యార్థులు, సామాన్యులు పడుతున్న కష్టాలను తెలిసి గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాష ఉంటే బోధన సులభతరం అవుతుందని ఉద్యమం చేశారన్నారు. ఎంతోమంది గ్రాంధిక వాదులు అడ్డుకొన్నా ఉద్యమాన్ని కొనసాగించి వ్యవహారిక భాషను అమల్లోకి తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముఖం, అధ్యాపకులు నందీశ్వరయ్య, సుబ్బయ్యనాయుడు, షేక్‌బెనజీర్, కిరణ్‌బాబు, రాజేష్, ఇంతియాజ్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో మరమ్మతులు


కాంక్రీటు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా ఆయన రాకపోకలు సాగించే మార్గంలో చిన్నచిన్న మరమ్మతులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి జలహారతి ఇవ్వనున్న హంద్రీ-నీవా కాలువ, కృష్ణా జలాలు చేరిన పరమసముద్రం చెరువులు ఉన్న ప్రాంతం కుప్పం పురపాలక సంఘం పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు దగ్గరుండి ఆయా పనులను పర్యవేక్షిస్తున్నారు. డీకేపల్లె కూడలి వద్ద పైపులైన్ నిర్మించిన ప్రాంతంలో కాంక్రీటు పనితోపాటు మరికొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

కూలిన నివాసగృహం పైకప్పు


కూలిపోయిన పైకప్పు

రామకుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది. బాధితుడి కథనం మేరకు... ఆనందరెడ్డి అనే వ్యక్తి రామకుప్పం ఎగువ బైపాస్‌రోడ్ పక్కన రాతి బండల పైకప్పుతో గత 25 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకుని కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పైకప్పు ఉరుస్తూ గోడలు తేమకు గురయ్యాయి. దీంతోవారు ఆ ఇల్లు వదిలి పక్కనే ఉన్న వేరొక ఇంటికి మారారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వారి ఇంటి పైకప్పు కుప్పకూలింది. గోడలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతోపాటు పక్కా ఇల్లు మంజూరు చేయాలని తహసీల్దారు కైలేష్‌కు వినతిపత్రం అందించారు.

హంద్రీ-నీవా కాలువలో నిమజ్జనాలు చేయకండి

- డీఎస్పీ పార్థసారథి

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో హంద్రీ-నీవా కాలువలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయరాదని కుప్పం డీఎస్పీ పార్థసారథి ఒక ప్రకటనలో హెచ్చరించారు. శ్రీశైలం నుంచి కుప్పం పరిధిలోని పరమసముద్రం చెరువు వరకు ఈ కాలువలో నీటి ప్రవాహం కొనసాగుతుందన్నారు . ఇదే సమయంలో వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిష్ఠించిన విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభం కానున్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రతిష్ఠించిన విగ్రహాలను ఎట్టిపరిస్థితుల్లోనూ హంద్రీ-నీవా కాలువలో నిమజ్జనం చేయరాదని, అలా చేస్తే కాలువలో నీరు ఆగిపోవడమే కాకుండా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. సమీపంలోని చెరువులు, గుంతలు వంటి జలావాస ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. వినాయక నిమజ్జనాల సమయంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలను తీసుకుని క్షేమంగా ఉండాలని డీఎస్పీ ఆకాంక్షించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చంద్రమాకులపల్లె విద్యార్థిని ప్రతిభ


జట్టు సభ్యురాళ్లతో గానవి (ఎర్ర డ్రస్)

పుంగనూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపుర్‌లో జరుగుతున్న జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించగా అందులో పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె విద్యార్థిని సి.గానవి అత్యంత ప్రతిభ కనబరిచింది. గురువారం చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రమణ, పీడీ మురళీధర్ మాట్లాడుతూ నారాయణపుర్‌లో ఈనెల 25 నుంచి సెప్టెంబరు మూడో తేదీ వరకు జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరుగుతుండగా రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎల్లారుబైలుకు చెందిన సి.శివకుమార్ కుమార్తె గానవి ఎంపికై వెళ్లినట్లు వివరించారు. బుధవారం జమ్మూకశ్మీర్- ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో జమ్మూకశ్మీర్‌పై 3-1 తేడాతో ఏపీ విజయం సాధించినట్లు తెలిపారు. గానవి ప్రతిభకనబరిచి రాష్ట్ర జట్టు విజయానికి తోడ్పాటు అందించడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నేతలు

రామకుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గడ్డూరులో వికలాంగుల హక్కుల సమితి (వీహెచ్‌పీఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం నడిబొడ్డున ఉన్న డా.అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూజలు చేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగా పింఛన్ల పెంపుతోపాటు పలు హక్కులను సాధించారన్నారు. కార్యక్రమంలో నేతలు రాఘవేంద్ర, వెంకటేష్, గోవిందప్ప, జయప్ప, ఆనందరెడ్డి, రామచంద్రప్ప, పార్థసారథి, పెరుమాళ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు సీఐగా మురళీమోహన్



పలమనేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గంగవరం సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్ బదిలీపై గురువారం పలమనేరు సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహరాజు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

'ఏఎంసీ' ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన తెలుగు తమ్ముళ్లు


ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

శాంతిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలకు మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుల ఆధ్వర్యంలో శాంతిపురం మండల తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, సింగిల్ విండో చైర్మన్ గోపాల్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు మణి, లోకేష్, పెద్దన్న, నారాయణస్వామి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాగరాజు, సింగిల్ విండో డైరెక్టర్ దాము, టీడీపీ నేతలు ఉయ్యాల జయరామిరెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణ, గోవిందరాజులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ సమావేశ భవనంలో గురువారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో రూ.65.4 లక్షల మేరకు తయారు చేసిన ప్రతిపాదనలకు ఆమోదించారు. మున్సిపాలిటీలో సాధారణ నిధులతో చేపట్టేందుకు అభివృద్ధి పనులకు సంబంధించి పిలిచిన టెండర్లకు సైతం సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలో ఖాళీ పడిన ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులను నియమించుకునేందుకు సమావేశంలో తీర్మానించారు. హంద్రీ నీవా జలాలను పలమనేరు మండలంలోని చెరువులకు, కౌండిన్య నదికి మళ్లించాలని తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యురాలు శారద కోరారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, మున్సిపాలిటీలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా స్మార్టు రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టాలి


డీలర్లతో సమీక్షిస్తున్న తహసీల్దారు అమరనాథ్

రొంపిచెర్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నుంచి మండలంలోని 28 చౌకదుకాణాలకు చెందిన లబ్ధిదారులకు నూతనంగా ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ అమరనాథ్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారంగా పనిచేసే ఈస్మార్ట్ రేషన్ కార్డుల జారీతో అక్రమాలు జరగవన్నారు. సమావేశంలో డీటీ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది, డీలర్ల సంఘం అధ్యక్షుడు రఘునాథ్, డీలర్లు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు


కుప్పం పట్టణం రైల్వే స్టేషన్ వద్ద పూజలందుకున్న భారీ వినాయకుడు


రామకుప్పం దిగువవీధిలో..


వి.కోట మార్కెట్‌లో వినాయకుడు


శాంతిపురం మండలం శివరామపురంలో సంబరాలు

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. కుప్పం మున్సిపాలిటీతో పాటు మండంలోని పలు గ్రామాలలో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. కుప్పం పట్టణంలోని ప్యాలెస్ రోడ్డు, రైల్వే స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ప్రత్యేకంగా ఉండి భక్తులను అలరించాయి. రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

● **పుంగనూరు:** పుంగనూరు పట్టణ, రూరల్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ వెంకటరమణ, హరిప్రసాద్‌లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమల, సదుం, చౌడేపల్లె , రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లోని అన్ని గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేపట్టారు. రొంపిచెర్లలోని ఫజులూపేటలో వినాయకస్వామిని చల్లా రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు.

● **వి.కోట:** వి.కోట మండల పరిధిలో వినాయక చవితిని పురస్కరించుకుని వాడవాడలా భారీ వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండల కేంద్రంలో మార్కెట్, సత్యసాయినగర్, భారత్‌నగర్, పత్రపల్లె, ఈశ్వర్‌నగర్, స్కూలు వీధి, బ్రాహ్మణవీధి, గంగమ్మగుడివీధి, దుర్గానగర్ తదితర ప్రాంతాలో వినాయకుడి వివిధ ప్రతిరూపాలతో కూడిన భారీ విగ్రహాలను స్థానికులు ఏర్పాటు చేశారు.


పుంగనూరు: కొత్తఇండ్లులో పాల్గొన్న యువత , గ్రామస్తులు


సోమలలో ప్రతిష్ఠించిన వినాయక స్వామి


పుంగనూరులోని ఎన్ఎస్‌పేటలో..


చౌడేపల్లె: శెట్టిపేట మోక్ష గణపతి ఆలయంలో స్వామివారి కల్యాణం

లబ్ధిదారుల నుంచి రుణాలు రికవరీ చేయించాలి


మాట్లాడుతున్న శ్రీరాములు నాయక్

సోమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు పొందిన లబ్ధిదారుల నుంచి రికవరీలు చేయించాలని ఏఎస్‌డబ్ల్యూ శ్రీరాములు నాయక్ తెలిపారు. గురువారం సోమల బాలుర వసతి గృహం వద్ద మండలంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమల మండలంలో రూ.1,36, 688,386, సదుం మండలంలో రూ.3,19, 901 చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సోమల , సదుం సంక్షేమ అధికారులు రాజేశ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కొడవలితో దాడి


గాయపడ్డ హరిత

సోమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు అత్తగారింటికి వచ్చిన ఓ యువకుడు భార్యను చంపడానికి కొడవలితో దాడి చేసిన సంఘటన సోమల మండలంలో గురువారం జరిగింది. నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లెకు చెందిన హరితకు ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా ముద్దులాపురానికి చెందిన రవిశేఖర్‌తో వివాహం జరిగింది. నెల క్రితం హరిత పుట్టినింటికి పిల్లలతో కలిసి వచ్చింది. నాలుగు రోజుల క్రితం రవిశేఖర్ తెట్టుపల్లెకు వచ్చాడు. ఈక్రమంలోనే గురువారం సాయంత్రం భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశంలో రవిశేఖర్ హరితపై కొడవలితో దాడి చేసి మెడపై నరికి పరారయ్యాడు. గ్రామస్తులు గాయపడ్డ హరితను సోమల వైద్యశాలకు, అక్కడి నుంచి తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుంగనూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం సింగిరిగుంట సమీపంలో ద్విచక్రవాహనం నుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. మండలంలోని సింగిరిగుంటకు చెందిన భార్యభర్తలు బోయకొండ, సుజాత ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చి పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా సుజాత ప్రమాదవశాత్తు వాహనం నుంచి జారి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయపడిన భార్య, భర్తలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించారు. సుజాత పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సలహా మేరకు తిరుపతికి తరలించి చికిత్సలు అందిస్తుండగా బుధవారం మృతి చెందినట్లు సమాచారం రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

పుంగనూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట సమీపంలో గురువారం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం ఎం.కల్లనాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్(35), కన్నప్ప(45)లు కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతున్నారు. మండలంలోని సుగాలిమిట్ట సమీపంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కన్నప్ప, చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం మదనపల్లెకు తరలించగా కన్నప్ప మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్

శాంతిపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కుప్పం నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం రానున్న సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోల, కడా పీడీ వికాష్ మర్మత్‌లు తుమ్మిశి వద్ద గల హెలిప్యాడ్‌ను పరిశీలించారు. తరువాత కడపల్లె పంచాయతీ శివపురం గ్రామంలోని సీఎం ఇంటి వద్ద ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. తరువాత కుప్పం మండలం పరమసముద్రం చెరువుకు వద్ద ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలనకు వెళ్లారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుప్పం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న మునిరాజు తదితరులు

కుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు వేదిక వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికపై ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మార్కెట్ కమిటీ పాలకమండలి చైర్మన్‌గా జి.మునిరాజు, సభ్యులుగా మునేంద్ర నాయక్, గోపి, ఎస్.వళ్లియప్ప, జి.తులసిబాబు, కళావతి, చంద్రకళ, సుకన్య, ఆస్మా, అనిత, శ్యామలాదేవి, భానుమతి, పవన్ కుమార్, వడివేలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్‌లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి


పద్యాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గంగవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు డిమాండ్ చేశారు. గంగవరం సాయినగర్‌లోని కళామందిరంలో ముందస్తు తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగవరం ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కన్నయ్య నాయుడు, తిమ్మప్పనాయక్, దాము, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చుక్కావారిపల్లెలో నూతన గంగమ్మ ఆలయం నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, నారాయణరాజు, జయరామరాజు, శ్యాంరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి


స్థల పరిశీలన చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి అని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన బోయకొండలో సెప్టెంబర్ 3న స్త్రీ శక్తి కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కురవ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, చౌడేపల్లె, సోమల టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ నాయకులు మహ్మద్‌గని, ఆమీద్‌ఖాన్, ఏపీఎం సుబ్రహ్మణ్యం, సీసీ సుగుణ, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువనాయకుడి అంత్యక్రియల్లో చల్లా బాబు



సోమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనాయకుడిని కోల్పోయిందని చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పెద్దఉప్పరపల్లెకు చెందిన టీడీపీ యువనాయకుడు యశ్వంత్ నాయుడు ఆకస్మిక మృతి చెందారు. ఆయన యశ్వంత్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

స్మార్టు మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలి

పలమనేరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ చేపడుతున్న స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా గురువారం పలమనేరు ఏడీఈ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తంచేశారు. అంతకు ముందు సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో 25 ఏళ్ల క్రితం బషీర్‌బాగ్‌లో జరిగిన పోలీసు కాల్పుల్లో అసువులుబాసిన అమరవీరులకు సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిరిధరగుప్తా, కమిటీ సభ్యులు కోదండరామయ్య, సీపీఎం నాయకులు సంజయ్, హారతిగంగప్ప, లక్ష్మయ్య, సీపీఐ నాయకులు గుర్రప్ప, శంకరప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకే మెజారిటీ పథకాలు

● స్త్రీ శక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే జగన్మోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తమ మేనిఫెస్టోలో మహిళలకే మెజారిటీ పథకాలు పొందుపరిచామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. గురువారం నాగయ్య కళాక్షేత్రంలో 'స్త్రీ శక్తి' విజయోత్సవ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలకు స్త్రీశక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి మహిళా సాధికారితను కల్పించారని చెప్పారు. రాష్ట్రంలోని మహిళలకు సీఎం చంద్రబాబు ఒక అన్నగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే అనేక ఇబ్బందులున్నా మహిళలకు ఉచిత ప్రయాణం సాధ్యమైందన్నారు.

నాడు ట్రోల్ చేశారు: 'మహిళలకు ఉచిత ప్రయాణమని గత ఏడాది ఆగస్టు 15వ తేదీకి ముందు పోస్టర్లు వేశాను. దాన్ని వైసీపీ నేతలు ట్రోల్ చేశారు. ఈ విషయం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీనే ఈ పథకాన్ని ప్రారంభిస్తాం' అని సీఎం చెప్పారని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, చిట్టిబాబు, తదితరులు ప్రసంగించారు. స్త్రీ శక్తి పథకం అమలుపై సీఎంకు పలువురు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే గురజాల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ అనురాధ, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతోపాటు మహిళా నాయకులు, క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

10వేల మందికి ఇంటి పట్టాలిస్తాం: విప్ థామస్



ముక్కళత్తూరు మిట్టదళితవాడ మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ప్రభుత్వ విప్ థామస్

గంగాధరనెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గంలో నాలుగేళ్లలో అర్హులైన కుటుంబాల్లో 10వేల మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ వెల్లడించారు. గురువారం టీడీపీనేతలు, అధికారులతో కలిసి వేల్కూరు కొత్త దళితవాడలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించాక ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో ముక్కళత్తూరు మిట్టదళితవాడకు చెందిన 40 మంది దళిత కుటుంబాలకు ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. నెల్లేపల్లె హైస్కూల్లో సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి పంచాయతీలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలు కలిసికట్టుగా అర్హులను గుర్తిస్తే ఇంటిపట్టాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇప్పిస్తానని చెప్పారు. అనంతరం 12 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్‌లను అందజేశారు. పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వైస్ చైర్మన్ అరుల్‌నాథన్, సింగిల్‌విండో త్రీమెన్ కమిటీచైర్మన్ మోహన్‌నాయుడు, డైరెక్టర్లు ఇమ్మానుయేల్, జ్యోతి యాదవ్, టీడీపీ నేతలు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవపత్ని ధనంజయనాయుడు, కామసాని కోదండరెడ్డి, జనార్ధన్‌రాజు, ఇందిరమ్మ, హరీష్‌యాదవ్, వడివేలు, జాన్, మునస్వామి, బుజ్జిబాబు, శంకర్,లోకనాథం,షడ్రాక్, అధికారులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో దేవదాయశాఖ మంత్రి



మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే మురళీమోహన్‌లను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

తవణంపల్లె, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామిని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాణరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, అర్ధగిరి మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు అమరేంద్రనాయుడు, రంజిత్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి: సీపీఐ

చిత్తూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ 'మీటర్లు రద్దు చేయాలి.. కరెంట్ చార్జీలు తగ్గించాలని' అంటూ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఈ మేరకు నిరసన తెలిపారు. నాయకులు నాగరాజు, విజయగౌరి, రఘు, బాలాజి, ఆనంద్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి జ్ఞాపిక అందజేత



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన కమ్మరి పార్వతమ్మను గురువారం పలువురు సన్మానించారు. కర్నూలులో ఆమెను జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దయానందచారి కలిసి కాణిపాక వరసిద్ధుడి జ్ఞాపికను అందజేశారు.

డీఎస్సీ సెలక్షన్ లిస్టు విడుదల చేయాలి: ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 మెరిట్ లిస్టు కాకుండా, సెలక్షన్ లిస్టు విడుదల చేయాలని అభ్యర్థులతో కలిసి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అపోలో ప్రాంగణంలో గురువారం నిరసన తెలిపారు. రాత పరీక్షల ఫలితాల తర్వాత ఆయా జిల్లాలకు సెలక్షన్ లిస్టులు క్యాటగిరీల వారీగా ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం మెరిట్ వచ్చిన అభ్యర్థులు సైతం తమకు కాల్ లెటర్లు రాలేదని సెంటర్‌కు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. నాయకులు గుణశేఖరన్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

నీటి వృథాకు చెక్



మొరవ వద్ద వేసిన ఇసుక బస్తాలను పరిశీలిస్తున్న నీరజాక్షులురెడ్డి, జీవరత్నం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం చెరువు మొరవకట్ట నుంచి నీటి వృథాకు ఎట్టకేలకు అడ్డుకట్ట వేశారు. పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, తూగుండ్రం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు యండ్రాల వెంకటేశులునాయుడు చొరవతో చిత్తూరు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, పాతపాళ్యం ఫీల్డ్ అసిస్టెంట్ సురేంద్రలు మొరవకట్ట వద్ద బుధవారం 90 ఇసుకబస్తాలను వేసి తాత్కాలికంగా నీటి వృథాను అరికట్టారు.

వెదురుకుప్పం రూరల్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా కట్

● ఇబ్బందిపడ్డ వినియోగదారులు

వెదురుకుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం రూరల్ ఫీడర్‌లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా కట్ అయ్యింది. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. వినాయక చవితి ఉత్సవాల వేళ కరెంటు సరఫరా లేకపోతే ఎలా అని, దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

సమయపాలన పాటించరా?

● పీహెచ్‌సీలో వైద్యాధికారి తీరుపై విమర్శలు

పూతలపట్టు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పీహెచ్‌సీలోని వైద్యాధికారి సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ఎప్పుడు పడితే అప్పుడు విధులకు వస్తున్నారు. దీనివల్ల రోగులకు స్టాఫ్ నర్సులే వైద్యం చేసి పంపుతున్నారు. పైగా రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. వికలాంగుల సర్టిఫికెట్ కోసం పేట అగ్రహారం సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు ఆ వైద్యాధికారి వద్దకెళితే చులకనగా వ్యవహరించాడని వాపోయాడు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వాడవాడలా 'చవితి' ఉత్సవాలు



మార్కెట్‌చౌక్ వద్ద గణేశుడికి హారతి ఇస్తున్న సీకే బాబు



గాండ్లవీధిలో పూలమార్కెట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన శెట్టియార్ వినాయకుడు



మురకంబట్టు ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ



డీఐ రోడ్డులోని శివశక్తి వినాయక మండపం వద్ద కేరళ డ్రమ్స్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల ఆకృతుల్లోని వినాయకుడి విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో స్థానిక నాయకులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గుడిపాల: మండలంలోని 197 రామాపురంలో వినాయకుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



పూతలపట్టు: మండలంలోని రంగంపేటలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న యువకులు



నగరి : బస్టాండులో వినాయక విగ్రహానికి పూజలు

విజయపురం: మండలంలోని మహారాజపురంలో ఏర్పాటు చేసిన వినాయస్వామి లడ్డూను దాత భాస్కర్‌కు బహూకరిస్తున్న నిర్వాహకుడు మణిరాజు



నిండ్ర: మండలంలోని ఒరూరుపేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి పూజలు



శ్రీరంగరాజపురం: మండలంలోని ముద్దికుప్పంలో జరిగిన వేడుకల్లో తెలుగు సాహిత్య సాంస్కృతి సమితి కోశాధికారి పైనేని మురళి





వెదురుకుప్పం: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న యువత









కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హంసవాహన సేవలో ఉభయదారులు - ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు కంకణం కడుతున్న ధర్మేశ్వర గురుకుల్ - పుష్పకావళ్లు తీసుకొస్తున్న శ్రీకాణిపాక విఘ్నేశ్వర యువజన సంఘం సభ్యులు

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి మురహరిశ్రీరామన్, ఏపీ అటవీశాఖ పీసీసీఎఫ్ అజయ్‌కుమార్‌నాయక్, తెలంగాణ ఐజీ నవీన్‌చంద్ ఉన్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, డీఎఫ్‌వో భరణి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.







పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో పెంచలకిషోర్ - తెలంగాణ ఐజీ నవీన్‌చంద్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు - ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురహరి శ్రీరామన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి

'రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం'

గంగాధరనెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమని జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి అడ్డులేదు.. సంక్షేమపథకాల అమలులో తిరుగులేదు' అని తెలిపారు.

కొత్తపేటలో వైభవంగా గంగజాతర



జాతర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, నాయకులు శ్రీనివాసన్, రజని, మాణిక్యవాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు

పెనుమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక సహకార సంఘం, రాఘవేంద్ర ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ వివరాలను పరిశీలించారు. డీఎస్పీ మల్లికార్జున, ఏవో రామాంజనేయరెడ్డి, వ్యవసాయాధికారి సుహర్‌లత పాల్గొన్నారు.

నగరంలో జోరువాన

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం సాయంత్రం అరగంటపాటు జోరువాన కురిసింది. రోడ్లపై కాలువల్లోని మురుగు ప్రవహించడంతో జనం ఇబ్బంది పడ్డారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది.

చెరువు నీరు కలుషితం

గుడిపాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగంపల్లె చెరువులోకి అక్కడున్న ఓ ప్రైవేటు ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు చేరడంతో నీరు కలుషితమైందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల చెరువులోని చేపలు మృత్యువాత పడ్డాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.2.46లక్షలు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):ఆరిమాని గంగమ్మ ఆలయానికి హుండీద్వారా రూ.2.46లక్షల ఆదాయం వచ్చిందని ఈవో వెంకట రాయల్ తెలిపారు. జిల్లాదేవదాయశాఖపర్యవేక్షణలో గురువారం హుండీలెక్కింపు జరిగింది.

పింఛన్లపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పింఛన్లపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చిత్తూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతిని సన్మానించిన అధికారులు

పెనుమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి అన్నారు. ఈ మేరకు గురువారం ఉగ్రాణంపల్లె జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం చెర్లోపల్లె ఎస్టీకాలనీవాసులతో సమావేశమై మౌలిక వసతులపై ఆరా తీశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో కిషోర్, ఎంఈవో రాజేంద్ర, హెచ్ఎం శ్రీదేవి, డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ ఏపీసీకి అభినందన



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్‌లో డీవీఎసీవోగా పదోన్నతి పొంది, జిల్లా సమగ్రశిక్షలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్ఎస్ ఏపీసీ)గా ఎఫ్ఏసీ కింద కొనసాగనున్న వెంకటరమణకు గురువారం పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో ఎస్ఎస్ ఇంజనీరింగ్ ఈఈ మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుడికి గ్రంథాంకితం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి, ఉపాధ్యాయురాలు శాంత భాస్కర్ రెడ్డి రచించిన గజేంద్ర మోక్షం గ్రంథాన్ని గురువారం వేపంజేరి లక్ష్మీనారాయణస్వామికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా అక్కడున్న భక్తులకు పుస్తక వితరణ చేశారు.

కమ్మవారి అభ్యుదయ సేవా సంఘ కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కమ్మవారి సేవా సంఘం కార్యవర్గ సభ్యులు

చిత్తూరు సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్మవారి అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. సంఘం అధ్యక్షుడు కేశవులు నాయుడు మాట్లాడుతూ.. కమ్మసామాజిక వర్గ వధూవరుల వివాహ పరిచయ వేదికను కూడా ఈ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. తమ కార్యాలయానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు చెన్నకేశవులు నాయుడు, కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు 'కౌన్సిల్' సమావేశం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం జరుగుతుందని మేయర్ అముద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.15 గంటలకు జరిగే ఈ సమావేశానికి కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిసియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

8 మంది జూదరుల అరెస్టు

వెదురుకుప్పం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిట్టూరు సమీపంలో జూద స్థావరంపై గురువారం వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య దాడిచేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4740 స్వాధీనం చేసుకున్నారు.

పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య



మునిరత్నం (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఓ పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బూసిపల్లె గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు మునిరత్నం (34) చిత్తూరు నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతను బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి బహుమతిగా ల్యాప్‌టాప్



గుడిపాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ సెకండియర్ చదివిన ఇంద్రజ.. 470కి 435 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఆమెకు ల్యాప్‌టాప్‌ను ఎన్ఆర్ఐ మోహన్ నాయుడు గురువారం బహుమతిగా ఇచ్చారు. విద్యా కమిటీ చైర్‌పర్సన్ డిల్లీబాయి, హెచ్ఎం దుర్వాసులు, లెక్చరల్ నౌషద్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీవో మార్గరెట్, ఈసీ రామమూర్తి పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు స్థల పరిశీలన

ఐరాల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఐ లవ్ ఐరాల వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు డాక్టర్ రెడ్డెప్ప గురువారం స్థల పరిశీలన చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు పరిశీలన

పెనుమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుంటిపల్లెలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంటును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకిషోర్, ఏఈ రమేష్‌బాబు పరిశీలించారు. అనంతరం సీఎస్ అగ్రహారంలో నూతన వాటర్ పైప్‌లైను పనులను తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.